క్లుప్తంగా

నేత్రదానం



నేత్రాలు దానం చేస్తున్న కుటుంబ సభ్యులు

పెనుబల్లి: పెనుబల్లికి చెందిన ఈడా అచ్యుత రావు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన నేత్రాలను సప్తపది లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఖమ్మం నేత్ర నిధికి అందజేశారు. ఈడా అచ్యుతరావు కుటుంబ సభ్యులకు సప్తపది లయన్స్‌క్లబ్ సభ్యులు నేత్రదానంపై అవగాహన కల్పించి ఖమ్మం నేత్ర నిధికి నేత్రాలను దానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ బాధ్యులు సుంకర సత్యనారాయణ, శ్రీదరాల సుబ్బారావు, టెక్నీషియన్ నాగేశ్వరరావు, కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులు

వైరా: వైరా స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తగా ఈత మెళకువలు నేర్చుకున్న వైరాకు చెందిన షేక్ పాషా, షేక్ అక్బర్‌లను ఆదివారం వైరా రిజర్వాయర్ వద్ద శాలువ, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈత అసోసియేషన్ సభ్యులు కోరుకొండ శ్రీను, ఏలూరు రాంబాబు, రాచబంటి నాగరాజు, కంకణాల అర్జునరావు, నారాయణ, శ్రీరంగం కృష్ణ, సతీష్ పాల్గొన్నారు

పంచాయతీ మాజీ పాలకవర్గ సభ్యులకు..



మాజీ పాలకవర్గంతో స్థానికులు

బోనకల్: మండలంలోని మోటమర్రి పంచాయతీ పాలకవర్గం గడువు ఇటీవల ముగియడంతో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ కేతినేని ఇందు నాగేశ్వరావు దంపతులతో పాటు మాజీ వార్డు సభ్యులను ఘనంగా శాలువలతో సన్మానించారు. ఐదేళ్లుగా గ్రామాభివృద్ధి చేసిన సేవలను వారు ప్రశంసించారు.

పంచాంగాల వితరణ



పుస్తకాలను అందజేస్తున్న నాయకులు

కారేపల్లి: శ్రీ కోది నామ సంవత్సర నూతన పంచాంగ పుస్తకాలను కారేపల్లికి చెందిన ఇందుర్తి సురేందర్‌రెడ్డి ఆదివారం పురోహితులకు బహూకరించారు. కారేపల్లి శ్రీసాయిబాబా మందిరంలో జరిగిన కార్యక్రమంలో కారేపల్లి, కామేపల్లి, గార్ల, రఘునాథపాలెం మండలాల అర్చకులకు పంచాంగ పుస్తకాలను అందజేయనున్నట్లు సురేందర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో అర్చక సంఘం అధ్యక్షులు కొత్తలంక కైలాషశర్మ, అర్చకులు వెంకటేశ్వరశర్మ గోదావరి భువనేశ్వరశర్మ, ఈశ్వరశాస్త్రి పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న నాయకులు



మొక్కు చెల్లిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రుపాలెం: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్కకు ఉన్నత పదవి రావాలని పార్టీ నాయకులు తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్నం వేలంగని మాత ఆలయంలో మొక్కుతీర్చుకున్నారు. మొక్కు తీర్చుకున్న వారిలో దేవరకొండ రాజీవ్‌గాంధీ, శ్రీనివాసరావు, గుడేటి బాబురావు, దేవరకొండ వెంకటరత్నం, దేవరకొండ అనీల్ కుమార్ ఉన్నారు.

గురుకుల ఉద్యోగం సాధించిన శ్రీలక్ష్మి



ఎర్రుపాలెం: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహించిన గురుకుల జూనియర్ కళాశాలల పోస్టుల ఫలితాల్లో మండలకేంద్రానికి చెందిన తల్లపురెడ్డి శ్రీలక్ష్మి జూనియర్ కళాశాల లెక్చరర్‌గా ఉద్యోగం సాధించారు. ఈ మేరకు శ్రీలక్ష్మిని పలువురు అభినందించారు.

ఎవరి ప్రయత్నం వారిది..!

మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై ఉత్కంఠ

- ఆదాయంలో మధిర మార్కెట్ జిల్లాలో రెండో స్థానం
- రిజర్వేషన్‌పైనే ఆశావహుల చూపు



మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

మధిర: మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందోనని కాంగ్రెస్ నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రంలో అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీలను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం తెలిసిందే. రాష్ట్రంలో 197 మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాలను ఏర్పాటు చేయటం జరుగుతుందని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఇటీవల ప్రకటించడంతో ఆశావాహులు మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కించుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. నియోజకవర్గంలో ఉన్న మధిర వ్యవసాయ మార్కెట్ పరిధిలో మధిర, బోనకల్, ఎర్రుపాలెం మండలాలు విస్తరించి ఉన్నాయి. అదేవిధంగా నియోజకవర్గంలో మార్కెట్ కమిటీ చైర్మన్ (ఏఎంసీ)పదవి అతిపెద్ద నామినేటెడ్ పదవి. అందువల్ల దానిని పొందేందుకు పార్టీ సీనియర్ నాయకులు తమ తమ ప్రయత్నాల్లో మునిగి ఉన్నారు.

జిల్లాలోనే రెండవ స్థానం

మధిర వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆదాయం జిల్లాలోనే రెండో స్థానంలో ఉంది. 2023–2024 సంవత్సరానికి గాను మధిర ఏఎంసీ ఆదాయం రూ. 4.34 కోట్లు కాగా జనవరి 31 వరకు రూ. 3.69 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది సీసీఐ ద్వారా రైతుల నుంచి 1.19 లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలుకు సంబంధించి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నుంచి రూ.83.04 లక్షల ఆదాయం ఇంకా రావాల్సి ఉంది. పత్తి, మిర్చి, ధాన్యం, సుబాబుల్ తదితర పంటల విక్రయాలకు సంబంధించి ఖమ్మం జిల్లాలో మధిర మార్కెట్ కమిటీ అత్యధిక ఆదాయం సాధించి ఖమ్మం జిల్లాలోనే రెండవ స్థానంలో నిలిచింది. అంతే కాకుండా అనేకసార్లు ఈ మార్కెట్ కమిటీ ఆదాయం నూటికి నూరు శాతం లక్ష్యాన్ని అధిగమించింది.

రిజర్వేషన్ కొనసాగేనా.. ?

నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే పదవి తర్వాత రెండో ప్రాధాన్యత కలిగిన మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నామినేటెడ్ పదవి దక్కించుకునేందుకు పలువురు ఆశావాహులు ఎదురుచూస్తున్నారు. చైర్మన్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం రిజర్వేషన్ ఏర్పాటు చేసింది. అంతేకాకుండా ఐదు విడతలకు ఒకేసారి రిజర్వేషన్లు ప్రకటించారు. మొదటి విడత జనరల్‌కు కేటాయించగా, 2, 3, 4వ సారి బీసీకి రిజర్వేషన్ ఖరారు చేశారు. ఐదో విడత జనరల్ మహిళకు కేటాయించారు. బీఆర్ఎస్ పాలనలో మధిర ఏఎంసీకి రెండు పాలకవర్గాలు పూర్తయి, మూడో పాలకవర్గం కొనసాగుతుంది. ఈ క్రమంలో సాధారణ అసెంబ్లీ ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారిపోయింది. గతంలో తీసిన రిజర్వేషన్ల ప్రకారం నాల్గో సారి కూడా బీసీ సామాజిక వర్గానికి మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ రిజర్వ్ చేయబడింది. కాంగ్రెస్ ప్రభుత్వం మార్కెట్ కమిటీల రిజర్వేషన్లు ఎత్తివేయకుండా యథావిధిగా అమలు చేస్తే మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బీసీ సామాజిక వర్గానికి కేటాయించాల్సి వస్తుంది. గతంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ మార్కెట్ కమిటీల రిజర్వేషన్ల ప్రక్రియ కొనసాగిందని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తే, మళ్లీ నూతనంగా రిజర్వేషన్లను ఎంపిక చేసే అవకాశం ఉంది.

బీసీకా.. ఓసీకా..?

గతంలో మాదిరిగానే రిజర్వేషన్ ఇప్పుడు కూడా బీసీకి రిజర్వేషన్ కొనసాగితే ప్రస్తుతం మధిర మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఉన్న సూరంశెట్టి కిషోర్‌కు ఏఎంసీ పదవి లభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నూతన ప్రభుత్వంలో రిజర్వేషన్లను మార్పు చేసి ఓసీకి కేటాయిస్తే ఎక్కువమంది పదవి కోసం పోటీపడే అవకాశం ఉంది. ఓసీ రిజర్వేషన్ వస్తే పైడిపల్లి కిషోర్, వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి తదితరులు ఆ పదవిని ఆశిస్తున్నారు. అదేవిధంగా ఓసీ మహిళకు రిజర్వేషన్ కేటాయిస్తే రంగా రూప, వేమిరెడ్డి వెంకట్రావమ్మ, కోట విజయశాంతితో పాటు పలువురు రేసులో ఉంటారు. ఇదిలా ఉండగా పార్లమెంటు ఎన్నికలు పూర్తయ్యేవరకు నామినేటెడ్ పోస్టుల భర్తీ జరగకపోవచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

టాలెంట్ టెస్ట్‌లో సత్తా..



విద్యార్థులను అభినందిస్తున్న భీమరాజు

మధిరరూరల్: ఖమ్మం జిల్లా స్థాయిలో పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్, ఖమ్మం జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన టాలెంట్ టెస్ట్ పోటీల్లో మర్లపాడు హై స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో మధిర మండలం మర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి లక్కిరెడ్డి రామ్మోహన్ రెడ్డి ప్రథమ స్థానంలో నిలవగా రూ.10 వేలు నగదు, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. మహదేవపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పోరల్ల నందిని తృతీయ స్థానం సాధించగా రూ.4 వేలు నగదు, మెమెంటో అందజేశారు. విజేతలకు హెచ్ఎం భీమరాజు మాట్లాడుతూ.. మధిర మండలం ఖమ్మం జిల్లాలోనే ప్రథమస్థానం సాధించడం గర్వకారమన్నారు. విలువలతో కూడిన నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలలోనే సాధ్యమవుతుందన్నారు.

వైభవంగా ప్రతిష్ఠ మహోత్సవం



శివాలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: హరహర మహాదేవ.. శంభోశంకర అంటూ భక్తుల శివనామస్మరణలతో సత్తుపల్లి మార్మోగింది. పట్టణంలోని గుడిపాడులోని శ్రీ దుర్గాపార్వతి సహిత కాశీవిశ్వేశ్వరస్వామి శివాలయంలో పునఃప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. తుని తపోవనం పీఠాధిపతి శ్రీసచ్చిదానంద సరస్వతి స్వామి పర్యవేక్షణలో వేదపండితులు ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, సీనియర్ సివిల్‌జడ్జి పి.అరుణకుమారి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్‌తో పాటు వేలాదిమంది భక్తులు దర్శించుకొని పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభానికి, దేవతామూర్తులకు పూజలు నిర్వహించారు. సుమారు 20 వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయం వద్ద రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ప్రారంభించారు. అదే విధంగా శ్రీ దుర్గాపార్వతి సహిత కాశీవిశ్వేశ్వరస్వామి శాంతి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అయ్యగారిపేట, గుడిపాడు గ్రామాల ప్రజలు శ్రీముత్యాలమ్మ తల్లికి బోణాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జైలర్ కొల్లి నాగేశ్వరరావు, కొల్లి వెంకటేశ్వరరావు, నున్నా రత్నాకర్, కొల్లి నర్సింహారావు, నాగళ్ల ప్రసాద్, బొంతు మాధవరావు, మోరంపూడి నిరంజన్, వల్లభనేని పవన్, మారుతి బాబురావు, సూరిబాబు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామి ప్రతిష్ఠ..



సుబ్రహ్మణ్య స్వామి విగ్రహం

ముదిగొండ: మండలంలోని అయ్యగారిపల్లిలో ఆదివారం వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవబృందం, వేద పండితులు, ఆగమన పండితులు మునగలేటి వంశీశర్మ, మునగలేటి రమేష్‌శర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కమలాపురం, అయ్యగారిపల్లి, సమీపంలోని గ్రామాల భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 10, 11 వ వార్డు సోమవరంలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం జరగనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఈ నెల 15 విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం గ్రామంలో స్వామి వార్ల విగ్రహాలు, ధ్వజస్తంభాన్ని ఊరేగించారు. ప్రధాన పూజారి ఇంగువ ఆంజనేయశర్మ నేతృత్వంలో బొడ్రాయి ముత్యాలమ్మ నవగ్రహాలకు ప్రత్యేయ పూజా అభిషేకాలు నిర్వహించారు.



అభయాంజనేయస్వామి దేవాలయం

పరామర్శ..



నివాళులర్పిస్తున్న మల్లు నందిని

ఎర్రుపాలెం: మండలంలోని సఖినవీడు, తక్కెళ్లపాడు, ఎర్రుపాలెం, బనిగండ్లపాడు, తదితర గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత మృతుల కుటుంబాలను ఆదివారం రాత్రి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని పరామర్శించారు. మృతుల కుటుంబాలకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, శీలం ప్రతాపరెడ్డి, కూరపాటి యశోద, పసుపులేటి వెంకటనారాయణ, బండారు నర్సింహారావు, మల్లెల లక్ష్మణరావు, బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, గంటా తిరుపతమ్మ, షేక్ జానీబాషా, బుర్రా నారాయణ తదితరులున్నారు.

పోగొట్టుకున్న పర్సు అందజేత..



పర్సు అందజేస్తున్న కండక్టర్ లక్ష్మణ్‌సింగ్

వైరా: బస్సులో పర్స్ పోగొట్టుకున్న వ్యక్తికి స్వయంగా ఫోన్ చేసి సదరు వ్యక్తికి కండక్టర్ పర్సు అందజేశారు. సత్తుపల్లి నుంచి ఖమ్మం వెళ్తున్న ఆర్టీసీ బస్సులో వైరాకు చెందిన పువ్వాళ్ల రంగారావు కల్లూరులో దిగి తన పర్స్ బస్సులో మర్చిపోయాడు. ఈ మేరకు బస్సులో పర్స్ గుర్తించిన కండక్టర్ లక్ష్మణ్‌సింగ్‌లో పర్స్‌లో ఉన్న కార్డుల ఆధారంగా తానే రంగారావుకు ఫోన్ చేసి పర్స్‌ను వైరా బస్టాండ్‌లో రంగారావు స్నేహితుడు కృష్ణారావుకు అందజేశారు. కండక్టర్ నిజాయితిని పలువురు అభినందించారు.

విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న చర్విభూమి

సత్తుపల్లిరూరల్: ఇంజన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ నిర్వహించిన పోటీ పరీక్షల్లో సత్తుపల్లి వీవీ విద్యాలయం విద్యార్థులు ప్రతిభ చూపారు. పాఠశాలకు చెందిన వనమారెడ్డి చర్విభూమి పెయింటింగ్‌లో జిల్లా టాపర్‌గా నిలిచింది. అదే విధంగా ఉత్తమ కో ఆర్డినేటింగ్ టీచర్‌గా ఎం.రమేష్ ఎంపికయ్యారు. ఖమ్మంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వీరికి బహుమతులు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రమేష్‌బాబు, వెంకటరెడ్డి, జోయల్ డెనియల్, ఒగ్గు భగవాన్‌రెడ్డి, గోరంట్ల వంశీకృష్ణ, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్య, వైద్యంపైనే ప్రధాన దృష్టి

- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రధానంగా విద్య, వైద్య రంగాలపైనే దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. స్థానిక జవహర్‌నగర్‌లోటీఎస్‌యూటీఎఫ్ సత్తుపల్లి డివిజన్ భవన నిర్మాణానికి ఆదివారం ఆమె భూమిపూజ నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలోని అన్ని పాఠశాలలను సందర్శిస్తానని దీనికి ఉపాధ్యాయులందరు సహకరించాలని కోరారు. అవసరమైన భౌతికవసరులు సమకూర్చటంతో పాటు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, బాలయ్య, నాగేశ్వరరావు, దుర్గాభవాని, రాజు, మహబూబ్‌అలీ, బండి నర్సింహారావు, కల్యాణం నాగేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, వెంకన్న, రంజాన్, కిషోర్‌సింగ్, కృష్ణ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి



మాట్లాడుతున్న సుజాత

చింతకాని: ప్రభుత్వాన్ని ఒప్పించి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కోశాధికారి కాల్వ సుజాత అన్నారు. మండల పరిధిలోని కొదుమూరు జ్యోతి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఆర్యవైశ్య సంఘం మండల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వంతో అమలయ్యే సంక్షేమ పథకాలు ఆర్యవైశ్యులకు వర్తించే విధంగా ప్రయత్నిస్తానన్నారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన నాగుబండి వెంకటనారాయణ, ప్రధాన కార్యదర్శి చల్లా కృష్ణారావు, కోశాధికారి కొండా దుర్గాశంకర్ కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనమా వేణుగోపాలరావు, నాయకులు దేవకి వాసుదేవరావు, కొదుమూరి జగన్నాథం, మృత్యుంజయరావు, సంఘం ఖమ్మం నగర అధ్యక్షుడు గొల్ల రాధాకృష్ణమూర్తి, మండల మాజీ అధ్యక్షుడు తేలుకుంట్ల శ్రీనివాసరావు, జవ్వాజి వీరాంజనేయులు, ఖమ్మం సాయినగర్ వాసవీ క్లబ్ అధ్యక్షుడు తేలుకుంట్ల ఓంకార్, ధనుంజయరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై సేవలు అభినందనీయం



ఎస్సై రామారావును సన్మానిస్తున్న నాయకులు

కారేపల్లి: తన విధులు నిర్వర్తిస్తూనే తన వంతుగా చేయూతను అందిస్తూ ప్రజలతో మమేకమైన ఎస్సై రామారావు సేవలు అభినందనీయమని పలువురు అన్నారు. ఆదివారం కారేపల్లి శివాలయం ప్రాంగణంలో కారేపల్లి ఎస్సైగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న పుష్పాల రామారావును రాజకీయ పార్టీల నాయకులతో పాటు, ప్రజాప్రతినిధులు శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వాంకుడోతు జగన్, ఎంపీపీ మాలోతు శకుంతల, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, ఇమ్మడి తిరుపతిరావు, ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు మేదరి టోనీ వీరప్రతాప్, టౌన్ అధ్యక్షుడు పోలగాని శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, సీపీఐ మండల కార్యదర్శి బోళ్ల రామస్వామి, ఎంపీటీసీలు ఆలోతు ఈశ్వరీనందరాజ్, ఇమ్మడి రమాదేవి, జడల వసంతవెంకటేశ్వర్లు, సంతగుడి చైర్మన్ అడ్డగోడ ఐలయ్య, నాయకులు సురేందర్ మనియార్, ఇందుర్తి సురేందర్ రెడ్డి, శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు అనంతారపు వెంకటాచారి, కమిటీ సభ్యులు పగడాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మందిర నిర్మాణ స్థలాన్ని మార్చాలి



నిరసన తెలుపుతున్న స్థానికులు

మధిర: మధిర పట్టణంలోని సుందరయ్య నగర్‌లో జనావాసాల మధ్య చేపట్టబోయే మందిర నిర్మాణాన్ని ఆపి వేరు ప్రాంతంలో నిర్మించాలని ఆ ప్రాంత వాసులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. శ్రీ సత్య సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ సత్య సాయి మందిరాన్ని నిర్మించేందుకు ట్రస్టు బాధ్యులు ప్రయత్నిస్తుండగా ఈ విషయాన్ని తెలుసుకున్న ఆ ప్రాంత ప్రజలు నిర్మాణం చేపట్టొద్దని నిరసన వ్యక్తం చేశారు. నిర్మాణం చేపడితే ట్రాఫిక్ సమస్యతో పాటు వాతావరణ కాలుష్యం, మైకు సౌండ్ తదితర సమస్యలు ఉంటాయని వారు ఆందోళన చెందుతున్నారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో కల్యాణపు పుల్లారావు, శ్రీనివాసరావు, నాళ్ల నారాయణరావు, బెజవాడ రవిబాబు, వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్


ఊరి పేరు బోర్డు శిథిలం



మధిర - విజయవాడ ప్రధాన రహదారిపై మండలకేంద్రంలోని ఎర్రుపాలెం పేరు బోర్డు పూర్తిగా శిథిలమైంది. ఈ బోర్డుకు పెద్ద కన్నం పడటమే కాకుండా పిచ్చి చెట్లు, ముళ్లకంప మధ్యలో ఉంది. దీనిని చూసిన ప్రయాణికులు ఆర్‌అండ్‌బీ అధికారుల తీరును చూసి.. కనీసం పేరు బోర్డు కూడా ఏర్పాటు చేయలేరా అని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. - ఎర్రుపాలెం

ప్రశ్నించాల్సిన అధికారి : రాజేష్, ఏఈ, ఆర్‌అండ్‌బీ శాఖ
సెల్ నంబర్ : 99123 40678

మున్నేరు మాటున అక్రమ రహదారి..



మున్నేరులో అక్రమంగా నడుపుతున్న టిప్పర్లు

ముదిగొండ: మధిర నియోజకవర్గంలోని చింతకాని -ముదిగొండ మండలాలోని మధ్యన ఉన్న మున్నేరులో అక్రమంగా ఓ రహదారిని ఏర్పాటు చేసి అక్రమంగా కంకర క్వారీల నుంచి టిప్పర్ల ద్వారా చింతకాని, బోనకల్, తదితర మండల, జిల్లాలకు తరలిస్తున్నారు. ఈ రహదారికి ఎలాంటి అనుమతులు లేవు, అయినా ఈ తంతంగమంతా అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియంది కాదని స్థానికులు అంటున్నారు. రైల్వే పనుల పేరుతో రూ.కోట్ల అక్రమ వ్యాపారం చేస్తున్న అక్రమ కంకర మిల్లుల నుంచి కంకర, గ్రానైట్ వ్యాపారాలు ఈ అక్రమ రహదారిలో కొనసాగుతున్నాయని ఆరోపణలున్నప్పటికీ ఆగని దందాని ఆ పని అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.